క్లుప్తంగా

7న ఉర్సు ఉత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం రామయ్యబౌలీలో హజ్రత్ షేక్ రఫియోద్దీన్‌షా ఖాద్రీ దర్గా ఉర్సు వేడుకలను ఈనెల 7న ఘనంగా నిర్వహించనున్నట్లు ముతవల్లీ షేక్ సైఫోద్దీన్ ఖాద్రీ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గంథోత్సవం, ధార్మిక సభ తదితర కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ రఫీయోద్దీన్ హుస్సేని, మహ్మద్ మహమూద్ హుస్సేని, మహ్మద్ అబ్దుల్ మొయిజ్, అబ్దుల్ మొహిమిన్, రిజ్వాన్ పాష ఖాద్రీ, ఇఫ్తెకార్, కర్నూల్‌కు చెందిన హుస్సేని పీర్ హుస్సేని, కర్నాటకలోని గోగి షరీఫ్‌కు చెందిన సయ్యద్ షా చందా హుస్సేని తదితర ధార్మిక వేత్తలు పాల్గొంటారని వివరించారు. ఇబ్రాహీం నక్షబంది, జహంగీర్‌పాష ఖాద్రీ, మహ్మద్ మజహర్ షరీఫ్, ఖాదర్ షరీఫ్, ఆసిఫ్ షర్ఫీ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

స్టేషన్ మహబూబ్‌నగర్: భూత్పూర్ మండలానికి చెందిన పలువురు బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల కార్యకర్తలు బుధవారం జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక ఎమ్మెల్యే చర్యలు భరించలేక భూత్పూర్ మండలం నుంచి బీఆర్‌ఎస్ కార్యకర్తలు పెద్దఎత్తున కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. భూత్పూర్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకుడు అన్వర్‌పాష పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

నవాబుపేట: పుర్సంపల్లికి చెందిన రొయ్యల శ్రీకాంత్ ద్విచక్ర వాహనంపై మంగళవారం నవాబుపేటకు వస్తుండగా చౌడాపూర్ నుంచి అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టిందని ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు. ఘటనలో శ్రీకాంత్‌కు తీవ్రగాయాలయ్యాయని వివరించారు. బాధితుడి తండ్రి బుధవారం ఫిర్యాదు చేశారని ఈ మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

మిడ్జిల్: వేములకి చెందిన మంద జంగయ్యకు చెందిన ఎద్దు బుధవారం వ్యవసాయ పొలం వద్ద గడ్డి మేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ గురై మృతిచెందింది. విద్యుత్ తీగలు కిందకు వేలాడుతుండడం వల్లే ప్రమాదం జరిగిందని బాధితుడు వాపోయారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని, దీంతో రూ.70 విలువైన ఎద్దును కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరారు.

నోట్ పుస్తకాల పంపిణీ

నవాబుపేట: మండలంలోని దరిపల్లి, గురుకుంట, కొండాపూర్ గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఫోరం రాష్ట్ర నాయకులు సత్యానారాయణ, నాయకులు నర్సింహులు, వెంకటేశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయంతో కార్మికులకు లబ్ధి

జడ్చర్ల టౌన్: గుర్తింపు కలిగిన భవన నిర్మాణ కార్మికులకు సంబంధించి ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10లక్షల వరకు అయ్యే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామని బీసీసేన కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు. బీసీసేన ముఖ్యులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ నిర్ణయంతో లబ్ధి చేకూరనుందన్నారు. అలాగే ప్రమాదబీమాను రూ.10లక్షలకు పెంచాలని, కల్యాణం కోసం ఇచ్చే రూ.30వేలను రూ.లక్షా యాభై వేలకు పెంచాలని కోరారు. లింగంపేట శేఖర్, చంద్రమౌళి, ఆంజనేయులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థికసాయం

గండేడ్: వివిధ కారణాలతో మరణించిన, రోడ్డు ప్రమాదానికి గురైన వారి కుటుంబాలకు పరిగి మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆర్థికసాయం అందజేశారు. బుధవారం వెన్నాచేడ్‌లో మల్లని అంజిలయ్య మృతి చెందగా అంత్యక్రియల నిమిత్తం సర్పంచ్ పుల్లారెడ్డి ద్వారా, జక్లపల్లిలో హన్మయ్య మృతి చెందగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నరసింహరావు ద్వారా అదేవిధంగా జంగంరెడ్డిపల్లిలో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కోస్గి వెంకటయ్యకు సల్కర్‌పేట్ సర్పంచ్ జితేందర్‌రెడ్డి ద్వారా సాయం అందజేయించారు. కార్యక్రమంలో శంకరయ్య, పులిందర్‌రెడ్డి, బాలయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: ఆముదాల గడ్డ తండాకు చెందిన కిషన్ 5రోజుల క్రితం మృతిచెందడంతో బుధవారం పరిగి మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తల ద్వారా రూ. 5వేల ఆర్థికసాయం బాధిత కుటుంబానికి అందజేయించారు. చెంద్రయ్య, గోపాల్‌రెడ్డి, రాములు, తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: మండలంలోని కందూర్ గ్రామానికి చెందిన పెంకుల మణెమ్మ అనారోగ్యానికి గురై మృతిచెందగా బాధిత కుటుంబాన్ని బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి పంపించిన రూ.5వేల నగదును అందజేశారు. అదేవిధంగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మున్నూర్ రమేష్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- 300 మంది కులవృత్తిదారులకు రూ. 3 కోట్ల పంపిణీ
- జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి



చెక్కులను అందజేసిన జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, కలెక్టర్ రవినాయక్, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర: వెనుకబడిన వర్గాలలో కుల వృత్తులను నమ్ముకుని జీవిస్తున్న వారికి కేసీఆర్ ఇస్తున్న వరం లాంటిది రూ. లక్ష ఆర్థికసాయం అని జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అన్నారు. సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్‌గా నిలిచిందన్నారు. ఆర్థికసాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బుధవారం నియోజకవర్గంలోని వెనుకబడిన కులాల కులవృత్తుల వారికి బీసీబంధు కింద రూ.లక్ష చొప్పున చెక్కులను పంపిణీ చేసే కార్యక్రమంలో మాట్లాడారు. ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ రవినాయక్‌లతో కలిసి నియోజవర్గంలోని 300 మంది లబ్ధిదారులకు రూ. లక్ష చొప్పున రూ. 3 కోట్ల చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కులవృత్తులను నమ్ముకున్న వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. అర్హులందరికీ సంక్షమ పథకాలు అందిస్తామన్నారు. కలెక్టర్ రవినాయక్ మాట్లాడుతూ ఆర్థికసాయాన్ని కుటుంబ పరిస్థితులు మెరుగుపడేందు ఉపయోగించుకోవాలని సూచించారు. నియోజకవర్గంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ కలిసి లబ్ధిదారుల ఎంపిక చేపట్టారని పేర్కొన్నారు. ఆర్థికసాయం రాని వారు నిరాశ చెందవద్దని అన్నారు. ఇది నిరంతరం సాగే పథకం అని వచ్చే నెల మరో మూడు వందల మందికి సాయం అందించనున్నట్లు వివరించారు. జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఇందిరా రాథోడ్, తహసీల్దార్ జ్యోతి, ఎంపీపీలు రమాదేవి, గుంతమౌనిక, హర్షవర్ధన్‌రెడ్డి, కదిరె శేఖర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, జెడ్పీటీసీలు అన్నపూర్ణ, రాజేశ్వరి, ఇంద్రయ్యసాగర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి

చిన్నచింతకుంట: రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీచైర్ పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఊకచెట్టువాగుపై నిర్మించిన చెక్‌డ్యాం నిండడంతో బుధవారం పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామం హైమాక్స్ లైట్లను ప్రారంభించారు. ఎంపీపీ హర్షవర్ధన్ రెడ్డి, జెడ్పీటీసీ వట్టెం రాజేశ్వరి, ఎంపీటీసీ ఉషా రాణి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం

మహబూబ్‌నగర్ రూరల్: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా వ్యాప్తంగా తల్లి పాల వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. తల్లి పాల ప్రాధాన్యం గురించి, శిశువు జన్మించగానే ముర్రు పాలు తాగించటంతో కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పిస్తూ అంగన్‌వాడీ కేంద్రాలలో కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని ఎర్రమన్నుగుట్ట, ఏనుగొండ ప్రాంతాలల్లో కార్యక్రమం చేపట్టారు. సూపర్‌వైజర్లు అలివేలు, జయప్రద, ఏఎన్‌ఎం శారద, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

హన్వాడ: మండలంలోని వెంకటమ్మకుంట తండా పరిధిలోని కొత్తతాండ అంగన్‌వాడీ కేంద్రం లో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. సర్పంచ్ రాములు నాయక్, అంగన్‌వాడీ టీచర్ ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఎర్రమన్నుగుట్టలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ అలివేలు

అభివృద్ధి పథంలో తెలంగాణ



డబుల్ రోడ్డుకు శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం 49వ వార్డు పరిధిలో పర్యటించి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పాత డీఈఓ కార్యాలయం నుంచి బోయపల్లి గేట్ వరకు డబుల్ రోడ్డుకు రూ.95.33 లక్షలు, క్రిస్టియన్‌కాలనీ, వైశ్య హాస్టల్, పాల్‌సాబ్ గుట్ట, వడ్డెరబస్తీలో సీసీరోడ్లు, డ్రైయినేజీకి రూ.55 లక్షలు, సుభాష్‌నగర్‌లో శివాలయం, రామాలయానికి రూ.50 లక్షలు, ఫంక్షన్ హాల్ సమీపంలో కల్వర్టుకు రూ.29.67 లక్షలు, టీఎన్‌జీఓ భవన్ నుంచి టెలిఫోన్ భవన్ వరకు నిర్మించే సీసీ రోడ్డు పనులకు రూ.45 లక్షల చొప్పున కేటాయించినట్లు వివరించారు. అనంతరం సమావేశంలో జిల్లాను అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.రాజేశ్వర్‌గౌడ్, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, ముడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, కమిషనర్ ప్రదీప్‌కుమార్, బీఆర్‌ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు కృష్ణమోహన్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజ్, కౌన్సిలర్ పుష్పవతి పాల్గొన్నారు.

102వాహనాలు ప్రారంభం

పాలమూరు: జిల్లాకు నూతనంగా కేటాయించిన 102వాహనాలను, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన మూడు అమ్మఒడి అంబులెన్స్ వాహనాలతో పాటు ఒక పార్థివ దేహం వాహనాన్ని బుధవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ బుధవారం ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకిషన్, డీఎంహెచ్‌ఓ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయండి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల సంరక్షణ విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు వినతిపత్రం వినతి పత్రం సమర్పించారు. ఈ మేరకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఉద్యోగులు వివరించారు.

గిరిజనులకు అండగా కాంగ్రెస్

స్టేషన్ మహబూబ్‌నగర్: గిరిజనులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని కాంగ్రెస్ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు లింగంనాయక్ అన్నారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆలిండియా ఆదివాసీ కాంగ్రెస్ విభాగం ఆధ్వర్యంలో మణిపూర్‌లో జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఈనెల 3న పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 6వ తేదీన ప్రతి గూడెం, తండాల్లో కాంగ్రెస్ ఎస్టీనాయకులు, ఇతర నాయకులు పల్లె నిద్ర చేస్తారని తెలిపారు. జిల్లా కేంద్రంలో 7న మైనార్టీ, ఎస్టీ, ఎస్సీ, బీసీ వర్గాలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. 8న సాయంత్రం కాగడాల ప్రదర్శన ఉంటుందని తెలిపారు. 9న హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, తండాల్లోని గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

కోయిల్‌కొండ: మండల కాంగ్రెస్ ఎస్టీసెల్ అధ్యక్షుడిగా అంకిళ్ల–1 ఎంపీటీసీ మహేందర్‌నాయక్‌ను జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి బుధవారం నియమించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్టీసెల్ అధ్యక్షుడు లింగంనాయక్, రవినాయక్ పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లోకి

భూత్పూర్: తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లోకి వస్తున్నారని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్ నివాసంలో ఒకటవ వార్డుకు చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరిన సందర్భంగా మాట్లాడారు. కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు నర్సింహులు గౌడ్, మత్స్య సహకారం సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు తదితరులు ఉన్నారు.

సహాయనిధి చెక్కుల పంపిణీ

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలోని క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. నిజాలాపూర్ చెన్నయ్యకు రూ. 3 లక్షలు, దేవరకద్ర రవీందర్‌కు రూ. 18,500, అచ్చయ్యపల్లి శాంతన్నకు రూ. 13,500, వడ్డెవాట శ్రీనుకు రూ. 12 వేలు, తిరుపతికి రూ. 15,500లు సహాయనిధి నుంచి మంజూరైనట్లు వివరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు జట్టి నర్సింహారెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, బాల్‌రాజు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచాలి

దేవరకద్ర: మన ఊరు– మన బడి పథకం కింద చేపట్టిన పాఠశాలల పునర్నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. బుధవారం దేవరకద్రలో డీఈఓ రవీందర్, ఇతర అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. శిథిలావస్థలో ఉన్న వాటిలో విద్యార్థులను కూర్చోబెట్టరాదని కొత్త భవనాలను కేటాయించాలని అధికారులకు వివరించారు. ఎంపీపీ రమాదేవి, ఎంఈఓ విజయశ్రీ,, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, సర్పంచ్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి దాతల విరాళం

కోయిల్‌కొండ: మండలంలోని కొత్లాబాద్‌లో సీతారామాంజనేయ, శివాలయ నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేశారు. బంటుచెన్నమ్మ, అంజయ్యలు రూ. 1.10 లక్షలు, అనంతయ్య 1.16లక్షలు, బుచ్చారెడ్డి రూ. 2లక్షలు, బుక్క ఇషాక్ పాష రూ.10వేలలు, ఖాజన్నగౌడ్ రూ.40వేలు, మల్లయ్య రూ.10వేలు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలుశిక్ష

అడ్డాకుల: మూసాపేట పరిధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో నందిపేటకి చెందిన వ్యక్తి ఇటీవల పట్టుబడగా బుధవారం మహబూబ్‌నగర్‌లోని కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్‌ఐ కె.శ్రీనివాసులు తెలిపారు. కాగా నిందితుడికి కోర్టు రెండు రోజుల జైలుశిక్ష, రూ.2500 జరిమానా విధించినట్లు వివరించారు.

ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ వినియోగించుకోవాలి

జడ్చర్ల టౌన్: ఎల్‌ఎఫ్‌ఎల్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ మంజులాదేవి సూచించారు. బుధవారం గీతాశ్రీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించేందుకు శిక్షణ తోడ్పడుతుందని వివరించారు. నోడల్ అధికారి దేవ్యా, హెచ్‌ఎం శౌరీ తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదుకు సహకరించాలి

భూత్పూర్: మండలంలోని వివిధ గ్రామాలల్లో పంటలను పరిశీలించడానికి సంబంధిత క్లస్టర్ ఏఈఓలు వస్తారని రైతులు వారికి సహకరించాలని మండల వ్యవసాయాధికారి మురళీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు ఏఏ పంటలు వేశారు, పంటల వారీగా విస్తీర్ణం తదితరాలు నమోదు చేస్తారని వివరించారు.

4న చలో హైదరాబాద్

మహబూబ్‌నగర్ న్యూటౌన్ : కార్మిక సమస్యల సాధన కోసం ఈ నెల 4న చలో హైదరాబాద్ కార్మిక గర్జన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి సి.వెంకటేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్మికులు భారీసంఖ్యలో తరలిరావాలని అన్నారు. ఈ మేరకు వారు జిల్లా కేంద్రంలో ప్రచారం చేసినట్లు వివరించారు.

విమర్శించే స్థాయిలేదు

మిడ్జిల్: నియోజక వర్గ సమస్యలపై పోరాటం చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు అనిరుధ్‌రెడ్డిని విమర్శించే స్థాయి బీఆర్‌ఎస్ నేతలకు లేదని పార్టీ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, ఇతర నాయకులు అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలలో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఎంపీటీసీలు గౌస్, నర్సింహ, రాజారెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధే బీఆర్‌ఎస్ ధ్యేయం



దేశాయిపల్లిలో గొర్రెల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

మహమ్మదాబాద్: తెలంగాణలో వెనుకబడిన అన్ని కులాలు, వర్గాల అభివృద్ధే బీఆర్‌ఎస్ ధ్యేయమని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి తెలిపారు. మంగంపేట్‌లో బుధవారం బస్‌షెల్టర్ ప్రారంభించారు. అనంతరం దేశాయిపల్లిలో ఆరుగురు లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ చేపట్టి మాట్లాడారు. రైతులను, వెనుకబడని కులాలను ఆదుకున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు రఘు, శ్రీను, కోఆప్షన్ సభ్యుడు సలీం పాల్గొన్నారు.

గండేడ్: పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి బుధవారం పెద్ద వార్వాల్‌లో గొర్రెల పంపిణీ లో పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారంలోకి వచ్చాక గొర్రెల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చు ట్టడం గర్వించదగ్గ విషయం అన్నారు. ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ ఈశ్వరయ్య గౌడ్, ఆర్‌ఎస్‌ఎస్ చైర్మన్ గోపాల్ పాల్గొన్నారు.

బీసీలు ఐక్యమత్యంతో ఉండాలి

మహమ్మదాబాద్: సమాజంలో వెనుకబడిన వర్గాలైన బీసీలు ఐక్యమత్యంతో ఉండాలని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి తెలిపారు. బుధవారం మంగంపేట్ గ్రామంలో రూ.10లక్షల నిధులతో బీసీ కమ్యునిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సర్పంచ్ శ్రీను, గోపాల్‌రెడ్డి ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

గండేడ్: ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలంటూ ఉమ్మడి మండల పరిధిలో పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు పెద్ద వార్వాల్‌లో ఎమ్మెల్యేను కలిశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు బచ్చన్న, కార్యదర్శి బాల్‌రెడ్డి, కాశీనాథ్ రెడ్డి ఉన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం

అడ్డాకుల: విద్యార్థులు తప్పకుండా వ్యక్తిగత పరిశుభ్రతను అలవర్చుకోవాలని మండల ఆయుర్వేద వైద్యురాలు లావణ్య సూచించారు. గుడిబండ పాఠశాలలో బుధవారం ఆయుష్‌శాఖ ద్వారా వర్షాకాలం వైద్య శిబిరంలో భాగంగా అవగాహన కల్పించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. తల్లిదండ్రులు తప్పకుండా పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. ఆయుష్ కరదీపికలను పంపిణీ చేశారు.



విద్యార్థులను పరీక్షిస్తున్న డాక్టర్ లావణ్య

కూలీలను అడ్డుకున్న కార్మికులు



అడ్డాకుల: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో బుధవారం పరిసరాలను శుభ్రం చేస్తున్న కూలీలను గ్రామ పంచాయతీ కార్మికులు అడ్డుకున్నారు. నెల రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్న క్రమంలో బస్టాండ్ పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. దీంతో గ్రామ పంచాయతీ ద్వారా కూలీలను ఏర్పాటు చేశారు. కాగా పనులు చేస్తున్న కూలీలను కార్మికులు అడ్డుకుని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో కూలీలు పనులను వదిలేసి వెళ్లారు.

వినతిపత్రం అందజేత

దేవరకద్ర: సమస్యలు పరిష్కరించాలని 28 రోజులుగా సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు బుధవారం ఇఫ్టూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ రవినాయక్‌లు పాల్గొన్న బీసీ కులవృత్తుల లబ్ధిదారుల సమావేశం వద్ద రోడ్డుపై జెండాలతో కొద్ది సేపు ప్రదర్శన చేశారు. సమావేశం తరువాత బయటకు వచ్చిన ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు. కాగా విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా కార్యదర్శి సాంబశివుడు, కార్మిక నాయకులు వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో పారిశుద్ధ్యాన్ని పట్టించుకోరా?



కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని ఉన్నతపాఠశాలలో పారిశుద్ధ్యం కనిపించడంలేదా, విద్యార్థులకు రోగాలు ప్రబలుతున్నా నివారణ చర్యలు ఎందుకు చేపట్టడంలేదని ఎంపీడీఓ జయరాములు హెచ్‌ఎం వెంకటాజీపై మండిపడ్డారు. పాఠశాలలో మురుగు నీరు చేరడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల తరగతి గదులతోపాటు ఆవరణను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులకు సురక్షితమైన తాగునీటిని అందించాలన్నారు. అదేవిధంగా మెను ప్రకారం భోజనం అందించాలని వివరించారు.

పోలీసుల శ్రమదానం



అడ్డాకుల: మండలంలోని గుడిబండ గ్రామంలో బుధవారం అడ్డాకుల పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో స్థానిక యువతతో కలిసి ప్రభుత్వ పాఠశాలలో పోలీసులు శ్రమదానం చేశారు. పాఠశాల ఆవరణతో పాటు తరగతి గదుల వెనుక ఉన్న కంపను తొలగించి చెత్తను ఏరివేశారు. చెత్తను పోగు చేసి పాఠశాల బయట కాల్చేశారు. గ్రామాల్లో యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఏఎస్‌ఐ లియాక్ అలీ అన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ సాయిప్రసాద్

గండేడ్: ఉపాధి హామీ పథకంలో పెండింగ్ పనులు సత్వరమే పూర్తి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ సాయిప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. హరితహారంలో నిర్లక్ష్యం తగదన్నారు. క్రీడా ప్రాంగణాలు అసంపూర్తిగా ఉన్నా, అసలే ప్రారంభం కాకున్నా వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. పండ్లతోటల పెంపకానికి ఇచ్చిన లక్ష్యం పూర్తిచేయాలని పేర్కొన్నారు. కమ్యునిటీ సోక్ పీట్‌లు సైతం తవ్వించాలన్నారు. సోషల్ ఆడిట్‌లో రికవరీలు వెంటనే కట్టాలని వివరించారు. సోషల్ ఆడిట్‌కు అన్ని సంసిద్ధం చేసుకోవాలని వివరించారు. ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, అంబుడ్స్‌మెన్ సంతోష్, ఏపీఓ హరిశ్చంద్రుడు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానం రద్దుచేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్చలు లేకుండా నూతన విద్యావిధానాన్ని అమలు పర్చిందని వెంటనే రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భరత్, నందు, తరుణ్, మొగిలి, శ్రీనాథ్ పాల్గొన్నారు.

కూరగాయల సాగుతో మేలు



కోయిల్‌కొండ: కూరగాయలు సాగుచేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం సహాయ అధికారి రవిశంకర్ అన్నారు. బుధవారం కేశ్వాపూర్‌లో కూరగాయల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ మొగులయ్య, ఉద్యానఅధికారి చంద్రశేఖర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లకు సన్మానం

దేవరకద్ర: తహసీల్దార్ జ్యోతి వనపర్తి జిల్లాకు బదిలీ కావడంతో బుధవారం కార్యాలయం వద్ద ఆమెను ఘనంగా సన్మానించారు. సింగిల్ విండో చైర్మన్ నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు జట్టి నర్సింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాల్‌రాజు, శ్రీనివాస్, రాము, సత్యం, ఖదీర్, అశోక్ పాల్గొన్నారు.

భూత్పూర్: తహసీల్దార్ చెన్నకిష్టన్నకు బుధవారం కార్యాలయ సిబ్బంది, వీఆర్‌ఏలు ఘనంగా వీడ్కోలు పలికారు. చెన్నకిష్టన్న దంపతులను ఘనంగా సన్మానించారు. ఉమ్మడి జిల్లాలో బదిలీల్లో భాగంగా భూత్పూర్ తహసీల్దార్‌గా ఉన్న ఆయన నాగర్‌కర్నూల్ జిల్లాకు వెళ్లారు. సీనియర్ అసిస్టెంట్ మమత, ఆర్‌ఐ వెంకటేష్, జూనియర్ అసిస్టెంట్ ఫరీద్, శ్రీధర్, వీఆర్‌ఏలు ఉన్నారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ఎం.గీత

భూత్పూర్: మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ఎం.గీత బుధవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారంగా మిడ్జిల్‌లో నయాబ్ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆమెకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఎస్‌ఐగా విజయ్‌భాస్కర్

కోయిల్‌కొండ: మండల ఎస్‌ఐగా విజయ్‌భాస్కర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో మహబూబ్‌నగర్‌లోని ఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు నిర్వర్తించారు. కాగా కోయిల్‌కొండలో విధులు నిర్వహించిన ఎస్‌ఐ సతీష్ నాగర్‌కర్నూల్ జిల్లా తెల్కపల్లి మండలానికి బదిలీ అయ్యారు.

ప్రభుత్వానికి అండగా నిలవాలి



ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని సన్మానిస్తున్న వీఆర్‌ఏల అసోసియేషన్ నాయకులు

జడ్చర్ల: పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం ఎంతో చేసిందని అండగా నిలవాలని ఎమ్మెల్యే డాక్టర్ సి.లక్ష్మారెడ్డి తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వీఆర్‌ఏల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించి స్వీట్లు తినిపించి మాట్లాడారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడాన్ని మరిచిపోలేమని వీఆర్‌ఏల సంఘం నాయకులు అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో బీడు భూములు సస్యశ్యామలం కానున్నాయని అన్నారు. ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణపనులను, టన్నెల్‌ను పరిశీలించి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని గమనించాలన్నారు. టీఎన్‌జీఓ అధ్యక్షుడు తిరుపతయ్య, వీఆర్‌ఏల అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు యూనిఫామ్స్

యూనిఫామ్ లేదంటూ స్థానిక పోలీసులు తమను వేధిస్తున్నారని ఆటో యూనియన్ ఆధ్వర్యంలో డ్రైవర్లు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి విన్నవించారు. దీంతో అందరికి తామే స్వయంగా యూనిఫామ్స్ పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అదేవిధంగా ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు జారీ చేస్తామన్నారు. నిబంధనలు ఉల్లంఘింస్తే చర్యలుంటాయన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

స్థానిక సంజీవయ్య కాలనీలో మహిళా సంఘ భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు.అదేవిదంగా 25వ వార్డులో వికాస్‌నగర్‌లో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టే మైనార్టీ కమ్యూనిటీ హాల్, ప్రహరీకి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మెన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.